నర్సరీ పనుల పరిశీలన

యాడారంలో నర్సరీని పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణాగౌడ్

బీబీపేట్, డిసెంబర్ 12 : బీబీపేట మండలంలోని యాడారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన నర్సరీ పనులను పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణాగౌడ్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ.. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన నర్సరీలో బ్యాగ్ ఫిల్లింగ్ పనులను పూర్తి చేసి ప్రజలకు అవసరమయ్యే సీడ్స్‌ను నాటించామన్నారు. ప్రతి రోజూ నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా వన సేవకులతో నీళ్లు పట్టిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది రాములు, విఠల్, ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణరెడ్డి, వన సేవకులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు వైద్య పరీక్షలు

భిక్కనూరులో హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఆదర్శ్

భిక్కనూరు, డిసెంబర్ 12 : భిక్కనూరు బాలుర వసతి గృహంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యుడు డాక్టర్ ఆదర్శ్ ఆధ్వర్యంలో మంగళవారం 60 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దగ్గు, జలుబు, చర్మ వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సతీశ్, శ్యామల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

మాచారెడ్డి, డిసెంబర్ 12 : మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు ఉదయం 11 గంటలలోగా సమావేశానికి హాజరు కావాలని పేర్కొన్నారు.

అయ్యప్ప స్వామి దేవాలయ వార్షికోత్సవాలు

దోమకొండ, డిసెంబర్ 12 : దోమకొండ మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయ దశమ వార్షికోత్సవాన్ని ఈ నెల 13 తేదీ బుధవారం రోజున నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వార్షికోత్సవంలో భాగంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని తెలిపారు. అలాగే ఈ నెల 18వ తేదీ సోమవారం స్వామి వారి ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో దోమకొండ అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు కదిరే మోహన్‌రెడ్డి, మన్నె సాయిరెడ్డి, అంకం బాల్‌రాజు, నల్లపు సంతోష్ కుమార్, కడారి రమేశ్, సేవా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి భక్తుల విరాళం

భిక్కనూరు, డిసెంబర్ 12 : మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో ఉన్న శ్రీల క్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికిగాను గ్రామానికి చెందిన ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు రూ.25 వేలను ఆలయ కమిటీ అధ్యక్షుడు సిద్ధరాంలుకు అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వామి, ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, గ్రామస్తులు అంజాగౌడ్, భాస్కర్‌రెడ్డి, బసవరెడ్డి, రవీందర్ గౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పోచారానికి శుభాకాంక్షల వెల్లువ

బాన్సువాడ టౌన్, డిసెంబర్ 12 : అసెంబ్లీ ఎన్నికల్లో బాన్సువాడ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ తరపున పోటీ చేసి భారీ మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిచిన పోచారం శ్రీనివాసరెడ్డిని నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బాన్సువాడలోని పోచారం స్వగృహానికి విచ్చేసి పోచారం శ్రీనివాసరెడ్డికి పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. చేసిన అభివృద్ధికి మెచ్చి మరోమారు తనకు అధికారం కట్టబెట్టినందుకుగాను ప్రతి ఒక్కరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. బాన్సువాడ ఆర్డీవో భుజంగరావు, జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ఎమ్మెల్యే పోచారానికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్డీవో భుజంగరావు, సిబ్బంది

విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే

బీబీపేట, డిసెంబర్ 12 : జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మంగళవారం అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కార్యక్రమంలో భాగంగా బీబీపేట మండలంలోని మాందాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు శ్రీసాయి క్రిష్, సీహెచ్ శ్రీనిధి రాష్ట్ర స్థాయిలో నో యువర్ ఎకో సిస్టమ్‌లో 'పక్షులు వాటి వలస' అధ్యాయనానికి సంబంధించి రాష్ట్ర స్థాయిలో గెలిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను కామారెడ్డి ఎమ్మెల్యే అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

విద్యార్థుల ప్రతిభను పర్యవేక్షించిన డీఈవో...

జాతీయ స్థాయికి ఎంపికైన మాందాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను డీఈవో రాజు మంగళవారం అభినందించారు. మాందాపూర్ గ్రామానికి వెళ్లిన ఆయన విద్యార్థులు చేసిన ప్రోగ్రాంను పరిశీలించి జాతీయ స్థాయి పోటీలకు సంబంధించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట మండల విద్యాశాఖ అధికారి ఎల్లయ్య, డీఎస్‌వో సిద్ధరామిరెడ్డి, విజయ పాల డైరీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ రమేశ్, మాందాపూర్ జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు సారయ్య, సిబ్బంది ఉన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం

అన్నదానంలో పాల్గొన్న మాలధారులు

కామారెడ్డి, డిసెంబర్ 12 : జిల్లా కేంద్రంలోని అయ్యప్ప నగర్‌లో ఉన్న అయ్యప్ప ఆలయంలో మంగళవారం ఉదయం నుంచి అభిషేకాలు, అర్చనలు, పడి పూజ తదితర పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అయ్యప్ప స్వాములకు, భక్తులకు అన్నదానం నిర్వహించారు. అయ్యప్ప స్వాములు, భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అన్న ప్రసాదసేవా సమితి సభ్యులు, స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

నస్రుల్లాబాద్, డిసెంబర్ 12 : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఏఎస్సై వెంకట్రావ్ సూచించారు. మండలంలోని బాన్సువాడ-బోధన్ ప్రధాన రహదారిపై మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులు డ్రువపత్రాలను వెంట పెట్టుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపే వారు సీటుబెల్టును ధరించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై కేసు నమోదు చేయడమే కాకుండా వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ముబీన్, హరిచంద్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

బీబీపేట్, డిసెంబర్ 12 : బీబీపేట మండలంలోని జనగామ రోడ్డులో ఎస్సై సాయిరెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సరైన డ్రువ పత్రాలు లేని 30 మంది వాహనదారులకు జరిమానా విధించారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని ఎస్సై సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై ప్రభాకర్, సిబ్బంది రవీందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

కామారెడ్డి, డిసెంబర్ 12 : జిల్లా కేంద్రంలోని రోటరీ క్లబ్‌లో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జైపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా శేర్ల రమేశ్, రంగ వెంకటేశ్వర్‌గౌడ్, దత్తాద్రి, ఎండీ అతికుల్లా, గౌమతి, ప్రధాన కార్యదర్శిగా అనిల్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, వీణ, భాస్కర్‌రెడ్డి, శివగౌడ్, ట్రేజరర్ నరేశ్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా నవీన్, దివ్య, లక్ష్మణ్, అనిల్ కుమార్, నరేశ్, మహేంద్రచారి, అంకుష్, నవీన్, రాజ్ కుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రకాశ్, ఎన్నికల అధికారిగా పంపరి విజయ్ కుమార్ వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన వారిచేత ప్రమాణ స్వీకారం చేయించారు.

తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కామారెడ్డి, డిసెంబర్ 12 : గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జీడీఎస్ జేఏసీ కన్వీనర్ పిలుపుమేరకు జిల్లా కేంద్రంలోని హెడ్‌పోస్టాఫీస్ వద్ద మంగళవారం నిరవధిక సమ్మెను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం శాఖ గ్రామీణ తపాలా ఉద్యోగులతో వెట్టిచాకిరి చేయించుకుంటుందని, గత ఎనిమిది సంవత్సరాల క్రితం గ్రామీణ తపాల ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన కమలేష్ చంద్ర కమిటీ అందించిన సానుకూల సిఫారసులు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. కాలానికి అనుగుణంగా పోస్టల్ శాఖలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విధులు నిర్వహిస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులకు పనికి తగిన వేతనం అందించడం లేదని, పర్మినెంట్ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ఎనిమిది గంటల పనిని కల్పిస్తూ అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. గ్రావిటీ రూ.5 లక్షలకు పెంచి హెల్త్ సౌకర్యం, జీడీఎస్‌లకు 12, 24, 36 ఇంక్రిమెంట్లను వెంటనే అందించాలని కోరారు. గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామీణ తపాలా ఉద్యోగుల ప్రెసిడెంట్ రాజిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ నయీం, సెక్రటరీ రుషి, అసిస్టెంట్ సెక్రటరీ, తపాలా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కామారెడ్డిలో ధర్నా చేస్తున్న గ్రామీణ తపాల ఉద్యోగులు

బాన్సువాడలో..

బాన్సువాడ టౌన్, డిసెంబర్ 12ః బాన్సువాడలోని తపాల కార్యాలయం ఎదుట ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ ఆధ్వర్యంలో తపాలా ఉద్యోగులు నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. మోదీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి డీడీఎస్ ఉద్యోగుల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారిందని వారు వాపోయారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, సాయిలు, గౌస్, రవీందర్, లక్ష్మి, శ్వేత, రాకేశ్ తదితరులు సమ్మెలో పాల్గొన్నారు.